# సంపాదకీయము

తారణ దీపావళి విశిష్ఠమయినది. అందరిలో వెలుగైయుంటూ తరింపచేసే పరంజ్యోతియే మోక్షార్థికి మార్గగామి. అ పరంజ్యోతిని దీపశిఖగా భావించి ధ్యానం చెయ్యడము సాధారణంగా మనం వింటుంటాము. కాని మనకు పూజ్య బాబూజీ గారు నియమించిన మార్గంలో ఆ జ్యోతిని వెలుగులేని కాంతిగా భావించి ధ్యానం చెయ్యడంలోని విశిష్ఠత అర్థంకావాలంటే జ్యోతి, వెలుగు, కాంతి యొక్క స్వరూపం తెలుసుకొనవలసియుంది. ఒక ప్రమిద, దానిలో నెయ్యి లేక నూనె, అందులో ప్రత్తితో చేసిన వత్తిని వెలిగించినపుడు జ్యోతి కలుగుతుంది. అందులో మనంచూసే కాంతి క్రిందివైపు కొంచెము వెడల్పుగాను, పైన క్రమేణా సన్నగిల్లి శిఖగా కన్పడుతుంది. ఆ కాంతి నలువైపులా ప్రసరించి వెలుగు నిస్తుంది. పరంజ్యోతి ఇహ జ్యోతికి విభిన్నంగ యుండవలసిన అవసరమెంతైనాయుంది. లేకుంటే అ జ్యోతిని పరం అనే విశేషణంతో పిలువనవసరము లేదు. ఇహపరమయిన కాంతికి క్రింది వైపు భాగము పైవైపుకంటే వేడి ఎక్కువయుంటుంది. పూజ్యబాబూజీగారు పైభాగంలో భారంలేని భారముందికాబట్టి క్రింది భాగము వేడికలిగి యుంటుందని చెప్తారు. (The lower part of its is heat because weightless weight is there above it. S.G.D.127). కాని పరంజ్యోతి విషయంలో అ వెలుగులేని కాంతి తీవ్రత పై వైపు ఎక్కువగాను క్రింది వైపు తక్కువగానూ యుంటుందనేది సాధకుల స్వానుభవము. మనము ధ్యానము చేసే విధానము అతి సూక్ష్మము కాబట్టి ఎటువంటి బరువు లేదు కాబట్టి క్రింది భాగంలో వేడియంతగాయుండదు. క్రింది స్థాయి మనస్సు యొక్క సహజమయిన వేడి మన సాధనలో యిందువలననే తక్కువగాయుంటుందనే విషయం మనకు తెలుసు. దీనికి తోడు ప్రశిక్షకుల తోడ్పాటుతో క్రిందిస్థాయి వేడి బాగా తగ్గి కాంతి దివ్యత్వము పొందుతుంది. ఏ సాధకునికైనా బాహ్యామైన కాంతి, వెలుగు రుచించదు. కొందరు దీనికి భిన్నంగా వెన్నెలలో ధ్యానం చేస్తారు. వారు మనస్సును ఆశ్రయించి పురోగతి సాధించాలని ప్రయత్నిస్తారేమో. భగవత్సామీప్యము కోరే వారు స్వప్రకాశమయిన వెలుగునే ఆశ్రయిస్తారు. దీపము స్వప్రకాశము కాదు. పైననుడివినట్లు అది పంచభూతములపై ఆధారపడియున్నది. అంతర్జ్యోతియై అమేయమగు శ్రీ కృష్ణ తత్వము స్వప్రకాశమయినది. దానిని ఎరుగవలెనంటే కాంతి లేని వెలుగుపైననే ధ్యానం చెయ్యవలసియుంటుంది.

ఈ కాంతి నిజ స్వరూపము నెరుంగుటకు మన గురుదేవులు ఆదేశించిన పద్ధతియే సరియైనది. ఎప్పుడయితే మనస్సులోని క్రిందిస్థాయి ఆలోచనలు తగ్గు ముఖం పడుతుందో పై స్థాయి భావనలు బలం పుంజుకొని మనలను ఆత్మోన్నతి వైపు పురోగమింప చేస్తుంది. అలాకాక మనం ఇహపరంగా ఆలోచించి నిమ్నస్థాయి భావనలను ఏ కారణం చేతనయినా

ప్రోత్సహించినపుడు అది మనకు ఆత్మచ్యుతి కలుగచేస్తుంది. అన్ని మార్గములూ ఒకటేయనేవారికి దీనిని తెలియచెయ్యవలసిన బాధ్యత ఎంతైనాయుంది. బాణాసురుడు మహా శివభక్తుడు. శివసాయుజ్యం కోరక అ పరమశివుడినే సతీసమేతంగా తనకు కాపలా కాయమన్న మూర్ఖుడు. శ్రీ కృష్ణ పరమాత్మ తన మనమని కాపాడడంకోసం అతని సహస్రబాహువులను తెగనరకి, వానిని నిర్జించే సమయంలో పార్వతీదేవి తన కుమారుడిగా భావించి విడువమనగా సోదరి కోర్కెను అంగీకరించినాడని మనకు తెలుసు. ఇందు మనకు తెలియవచ్చేదేమిటంటే తరతమ భేధం పాటించవలసిన అవసరం ఎంతైనాయుందని. బాణాసురిని స్నేహితుడు భౌమాసురుడు. సాక్షాత్తూ శ్రీ హరి, భూదేవి తనయుడు. సహవాసముచే చెడి శ్రీ కృష్ణుని లీలా వైభవమువలన తల్లిచేతిలోనే సాయుజ్యమందినాడు. వెలుగు వివేకాన్ని ప్రసాదించాలి. పారమార్ధిక వివేకము సూక్ష్మమయినది. చంద్రుని వెలుగో, సూర్యుని వెలుగో, నక్షత్రముల వెలుగో, సాధారణ జ్యోతి వెలుగో మనలను మన గమ్యంవైపు కొని పోజాలదు. మన ధ్యేయంకూడా పరమయినదిగానేయుండాలి. వెలుగు లేని జ్యోతిపై ధ్యానం విశిష్ఠమయినదని, అది అతి సూక్ష్మమయినదని, పరంజ్యోతిని అట్టి సూక్ష్మమయిన సాధన ద్వారానే పొందగలమని తెలియాలి. మంత్రం, తంత్రం, విగ్రహారాధన, యంత్రారాధన ఈ సమీపకాలంలో పెచ్చుమీరి యుండడము మనం గమనిస్తున్నాము. ఈ పద్ధతులు పరంకోరే వారలకు ఎటువంటి సహాయము చేయదు కదా సూక్ష్మమయిన పూజ్య బాబూజీ గారి పద్ధతితో పాటు వీటిని ఆచరించేవారిని ధ్యేయనిర్ణయము సరిగా చెయ్యలేదనే మనం గ్రహించాలి. అందువలన వీరు స్థూలమైన సాధనాపద్ధతులతో ఆధ్యాత్మిక ఎదుగుదల పొందలేని స్థితికి చేరిపోతారు. కామ, క్రోదములను కొంతవరకు వీరు తగ్గించుకోగలిగినా, లోభ, మోహ, అహంకారముల బారినుండి వీరు బయట పడలేరు. ఎందుకంటే వీరు ఆచరించే పూజా విధానాల ముఖ్య వుద్దేశమదియే కాబట్టి. బాణాసురుడు (నరకుడు) మొదలగు వారూ సాధకులే, కాని గమ్యనిర్ణయంలేని వారే. వారికోర్కెలు కొండంతలయితే, ఇట్టివారి కోర్కెలు చీమలపుట్టంత. అంతే తేడా. శ్రీ కృష్ణావతారము, శిశుపాల దంతవక్రుల వధతో అంతం కాలేదు. జయ, విజయులు శాపవశాన హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా జన్మించినపుడు వరాహ, నరహింహుల అవతారములతో వారి దైవకార్యమును నిర్వర్తించి, తరువాత రావణ, కుంభకర్ణులుగా వారు జన్మించినపుడు శ్రీరాముడిగా అవతరించి మరలివెళ్లి పోయిన దైవము, శ్రీ కృష్ణునిగా అవతరించినపుడు జయ, విజయ సంహారముతో తన అవతారము చాలించక ప్రపంచములోయున్న నీచ ప్రవృత్తి కలిగియున్నవారిని నిర్జించి తన అవతారమును చాలించినాడు. నిర్జించడము యనునది స్వతహాగా పశు ప్రవృత్తి. దానిని ఉపయోగించునపుడు కలిగే భావవుద్రేకము విచక్షణాలోపము ఎంతైనాయుంటుంది. పరశురాముడు దుష్ట క్షత్రియులను నిర్మూలించినను, శ్రీ కృష్ణుడు పలువురసురులను నిర్జించిననూ, భూమాత ఇక్కట్లు తగ్గనందున, శ్రీ రామచంద్ర మహారాజ్‌ను మానవ నైజంలోనే మార్పు

తీసుకొనిరమ్మన్న ఆదేశముతో భగవంతుడు పంపినాడని ఈ సాధన చేసేవారికి తెలుసు. ఇతరులు త్వరలోనే ఈ రహస్యాన్ని తెలుసుకొంటారనేది మన విశ్వాసం. ఈయన తన జీవితకాలంలోనే కాక తన మహాసమాధి తరువాత కూడా పని చేస్తానని చెప్పడమేకాక మన సాధనలో ఎన్ని రకములుగా దోహదపడుతున్నాడో ఆ సహాయం పొందేవారికే తెలుసు. వారి ఆశీస్సులు అందరికీ అందించాలనే మన సంస్థ కార్యక్రమములలో అందరూ పాలుపంచుకోవాలని నా విజ్ఞప్తి.

(సత్యపథము : 2004 : దీపావళి సంచిక : 11-4)